తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## నడిమూరు అటవీప్రాంతంలో జంట ఏనుగులు



కుప్పం,మే 12 ప్రభాతవార్త
రామకుప్పం మండలంలో గతకొంతకాలంగా పంటలపై దాడులు చేసిన జంట ఏనుగులు కుప్పం మండలం నడిమూరు అటవీ ప్రాంతానికి చేరాయి. ఆదివారం రాత్రి జంట ఏనుగులు కుప్పం మండలం నాయనూరు అటవీ ప్రాంతంకు రాగా అటవీ అధికారులు, సిబ్బంది ఏనుగులను దారి మళ్లించే చర్యలు చేపట్టారు. ఈ ఏనుగులు నూలుకుంట మీదుగా కొత్తపల్లి చేరుకున్నాయి. మార్గమధ్యంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను కొంతమేర ధ్వంసం చేశాయి. పైపాళ్యం, వసనాడు ప్రాంతాల మీదుగా అవి నడిమూరు అటవీ ప్రాంతం చేరాయని అటవీ అధికారులు తెలిపారు. అక్కడ నుంచి తమిళనాడు అటవీ ప్రాంతంలోకి ఏనుగుల్ని తరిమేందుకు అటవీ అధికారులు, సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

## గరుడునిపై మలయప్ప



తిరుమల, మే 12
ప్రభాతవార్తప్రతినిధి:
వైశాఖమాస పౌర్ణమివేళ సోమవారం రాత్రి చల్లటిగాలులు వీస్తుండగా మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడునిపై కొలువుదీరిన మలయప్పకు కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగింది.

# చిత్తూరు నడివీధి గంగ జాతర ప్రారంభం



చిత్తూరురూరల్, మే 12 ప్రభాతవార్త:
చిత్తూరు నడివీధి గంగజాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గంగజాత వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు చిత్తూరు బజారు వీధిలోని నడివీధి గంగమ్మకు మంగళవారం వేకువజాము తొలి హారతి ఇవ్వడంతో చిత్తూరు నగరంలో గంగ జాతర ప్రారంభం అవుతుంది. గంగజాతరకు చిత్తూరు, దాని పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం వుండటంతో ఇటు మున్సిపల్ కార్పొరేషన్, అటు పోలీసు యంత్రాంగం గంగజాతర నిర్వహణను విజయవంతం చేయడానికి పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నాయి. చిత్తూరు నడివీధి గంగమ్మను మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేకంగా వచ్చి దర్శించుకుని వెళ్ళనున్నారు. చిత్తూరు నడివీధి గంగజాతర వేడుకలు సుమారు ఏడు శతాబ్దాల క్రితం పురుడు పోసుకున్నాయి. అప్పటి నుండి అన్ని కులాల వారు మీరాశీలు కలసికట్టుగా జాతర వేడుకలను వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. చిత్తూరు నడివీధి గంగజాతర వేడుకలు ప్రతి ఏడాది రెండు రోజుల పాటు జరుగుతాయి. నడివీధి గంగమ్మ తల్లికి తొలిరోజు ధరించే అభరణాలను సిద్ధం చేశారు. అమ్మవారికి కొత్తగా చేయించిన మంగళ సూత్రం, నాగపడకలు, ముక్కుపుడక, ఇతర అభరణాలను వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఇప్పటికే ప్రదర్శించి వాటిని మంగళవారం అమ్మవారికి అలంకరించనున్నారు. జాతర రెండవ రోజైన బుధవారం పొన్నియమ్మన్ వీధి వర్తక, వ్యాపారులు ఆధ్వర్యంలో అనువంశిక మీరాశీదారులు, మాజీ ఎమ్మెల్యే సికె బాబు అమ్మవారికి ఊరేగింపుగావెళ్ళి సారె సమర్పించనున్నారు. బుధవారం సాయంత్రం గంగమ్మ నిమజ్జ నంకు తీసుకెళ్ళనున్నారు. గంగజాతరను ప్రశాం తం వాతావరణంలో పూర్తి చేయడానికి 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ పోలీసులకు దిశా నిర్దేశం చేశారు.

# అలసిన గంగమ్మకు అర్ధరాత్రి శాంతి అభిషేకం

## నేడు తిరుపతి గంగమ్మ జాతర



తిరుపతి(రవాణ),మే 12ప్రభాతవార్త:
తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతరలో సోమవారం అర్ధరాత్రి శాంతిఅభిషేకం ప్రశాంతంగా జరిపించారు. ఆలయ జాతర కమిటీ సభ్యులుతోబాటు ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు గంగమ్మకు పాలు, పెరుగు,తేనె, పసుపు,కుంకుమ, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకించారు. 6వతేదీ నుండి గంగమ్మజాతరలో వారం రోజుల పాటు విశేష అలంకరణల్లో జాతరలో అలసిన గంగమ్మకు ప్రధాన జాతర పండుగకు ముందు శాంతిఅభిషేకంతో అమ్మవారిని శాంతింపజేయడం జరిగింది. కాగా నేడు మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారి దర్శనం, భక్తులు భారీగా చేరుకుని అమ్మవారికి పొంగళ్ళు పెట్టడం, తమతమ మొక్కుల్లో వేషాలు వేసి అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుంది. ఆలయంలో అన్నీ ఏర్పాట్లు చేసి ప్రత్యేక క్యూలైన్లు నిర్వహిస్తున్నారు. తిరుపతి నగర డిఎస్పీ భక్తవత్సలం, క్రైమ్ డిఎస్పీ శ్యామ్‌సుందర్, సిఐలు రామకిశోర్, శ్రీనివాసులు, మురళీమోహన్. ఎస్‌ఐలు, పోలీసులు సిబ్బంది భారీ భద్రతలో నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం సప్పరాలు వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నగర మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మను దర్శించుకున్నారు. గంగమ్మ ఆలయ ఇఒ జయకుమార్ ,ఆలయ సిబ్బంది భక్తులకు ప్రశాంత దర్శనాలు చేయించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు

# చిత్తూరులో 234 సమస్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరురూరల్, మే 12 ప్రభాతవార్త:
కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సమస్యలపై 234 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ సత్వరం సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 189 అర్జీలు అందాయని, డిఆర్‌డిఎ 21, పౌరసరఫరాల శాఖ 5, ఎస్‌పిడిసిఎల్ 5, రిజిస్ట్రేషన్ల శాఖ 2, పోలీసు శాఖ 7 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో 238 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 12 ప్రభాతవార్త :
నవ్వుతూ...పలకరిస్తూ ప్రజా సమస్యలను తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అర్జీదారులను వినతి పత్రాలు అందుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి 238 అర్జీలు అందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవతో గత రెండు సోమవారాలు అర్జీదారుల ఫిర్యాదులు, అర్జీలు తక్కువ రావడం, ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కార దిశగా కలెక్టర్ అడుగులు వేయడం ఎంతో సంతోషంగా ఉందని అర్జీదారుల నుంచి వినిపిస్తున్న మాటలు. ఇదే తరహాలో తిరుపతి జిల్లా పరిధిలోని డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది నవ్వుతూ...పలకరిస్తూ అర్జీదారుల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కరించే దిశగా పనిచేస్తే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కారమవుతాయి.

### చిన్నశేష, హంసవాహనంపై

# మువ్వ గోపాలుని సాక్షాత్కారం





నారాయణవనం, మే 12 ప్రభాతవార్త :
నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి సోమవారం ఉదయం కల్యాణ వేంకటేశ్వరుడు చిన్నశేషవాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు కల్యాణ వేంకటేశ్వ రున్ని హంస వాహనంపై భక్తులకు దర్శనంభాగ్యం కల్పించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, భేరితాడనము నిర్వహిం చారు. చిన్నశేష వాహనంపై ఊరేగిన కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహిం చారు. సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తలను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం 6గంటల నుంచి గంటపాటు ఊంజల్ మండపంలో ఊ ంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి సేవలో తరించారు. కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:
శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై సోమవారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలం కరణ గావించి గరుడవాహనంపై అధిష్టింప జేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ పండు వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహన సేవలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### తడ పంచాయతీ పల్లెపాలెం వద్ద

# పిడుగుపాటుకు యువకుడు మృతి





తడలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన డేవిడ్ (26) కుటుంబ సభ్యుల రోదనలు

తడ, మే 12 ప్రభాతవార్త
తడ మండలం తడ గ్రామ పంచాయతీ పరిధిలో పల్లెపాలెం వద్ద సోమవారం సాయంత్రం పిడుగు పడి డేవిడ్ (26) అనే యువకుడు మృతిచెందాడు. సుజాతనగర్, పల్లెపాలెంల సమీపంలో క్రికెట్ గ్రౌండ్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పిడుగు పడిన వెంటనే డేవిడ్ మృతిచెందగా, సహచరులు స్వల్ప గాయాలకు గురై బయటపడ్డారు. ఈ మేరకు సోమవారం రాత్రి గ్రామస్థులు తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహశీల్దార్ శరత్‌బాబు సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. క్రికెట్ ఆడేందుకు వెళ్లి డేవిడ్ మృతి చెందడంతో అతను నివాసం ఉండే సున్నపుబట్టీ వీధిలో విషాదఛాయలు అలముకున్నాయి. తడ పోలీసులు యువకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలోని మరికొన్ని చోట్ల కూడా సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం, ఈదురుగాలులు బలంగా వీచాయి. చేనిగుంట, తడకండ్రిగ, తడ ప్రాంతాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు ఆయా గ్రామస్థులు తెలిపారు.

### కాణిపాకంలో

# శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



కాణిపాకం, మే 12 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో సోమవారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఘనం గా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు.

**ఘనంగా పున్నమి గరుడసేవ**

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పంగుణి పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. ఆసందర ్భంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మరమగ్గ కార్మికుడు మృతి



పుత్తూరు, మే 12 ప్రభాతవార్త :
పట్టణంలోని గేట్‌పుత్తూరులో విద్యుత్ షాక్ తగిలి ఒక మరమగ్గ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానిక ఓల్డ్ వీవర్స్ కాలనీకి చెందిన రాజేంద్ర (35) మరమగ్గంపై పని చేస్తున్నాడు. రాత్రి ఏడు గంటల సమయంలో మగ్గంలో చిన్నపాటి మరమ్మతును బాగు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా రాజేంద్ర మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

# డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు

## 30 మందికి గాయాలు



చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:
రక్తదాహం తీరని జాతీయ రహదారిపై అర్ధరాత్రి వేళ క్షణ కాలం డ్రైవర్ కునుకు తీశాడేమో వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టడంతో 30 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. తిరుమల డిపో ఆర్టీసి బస్సు తిరువణ్ణామలై నుండి తిరుమలకు వస్తుండగా చంద్రగిరి మండల పరిధిలోని అగరాల వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టిన ధాటికి బస్సు ముందు భాగం ఛిద్రమైంది. అదృష్టవశాత్తు డ్రైవర్, కండక్టర్ సహా ప్రయాణికులు ప్రాణాపాయ స్థితి నుండి గాయాలతో బయటపడ్డారు. సిఐ సుబ్బరామిరెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజారెడ్డిపై కేసు నమోదు చేశారు.

# పత్రపుష్పాలతో కపిలేశ్వరునికి పుష్పయాగం

తిరుపతి,మే 12ప్రభాతవార్త:
శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 2టన్నులు పత్రాలు, 2టన్నులు పుష్పాలతో పుష్పయాగ మహోత్సవం వేదోక్తంగా జరిపించారు. చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆకులతో కపిలేశ్వరస్వామి, కామాక్షిఅమ్మవారి ఉత్సవమూర్తులకు పుష్పాలతో అభిషేకించారు. ఆలయంలో భక్తులవల్లగానీ, అర్చకులవల్ల, అధికారుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం జరిపించడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు, ఏఈఓ సుబ్బరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, భక్తులు పాల్గొన్నారు. పుష్పయాగం నిర్వహణలో విజయవంతమైన డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులును ప్రత్యేకంగా సన్మానించారు.





## జవాన్ సోషల్ మీడియా ఆరోపణలు అవాస్తవం

పుంగనూరు రూరల్, మే 12, ప్రభాతవార్త



ఆర్మీ జవాన్ మోహన్ చేసిన సోషల్ మీడియా అవాస్తవమని పట్రపల్లి వద్ద చిట్టెమ గారి పల్లి గ్రామస్తులు సోమవారం వివరించారు. వారు మాట్లాడుతు ఆర్మీ జవాన్ గా విధులు నిర్వహిస్తున్న గ్రామ వాసి మోహన్ తన కుటుంబానికి అన్యాయం జరిగిందని సోసియల్ మీడియా ద్వారా పోస్ట్ చేసిన వీడియో అవాస్తవమని ముక్త కంఠంతో ఖండించారు. ఆర్మీ జవాన్ కుటుంబం గ్రామంలో అలజడులు. అల్లర్లు సృష్టించి గ్రామస్తులపై రకరకాలుగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మీ జవాన్ మోహన్ గ్రామంలో పలుమార్లు గొడవలకు దిగాడని అన్నారు. వారి కుటుంబం లో పోలీసు, టీచర్, ఆర్మీ అధికారులు ఉన్నారని బెదిరింపులకు పాల్పడుతు న్నారని గ్రామస్తులు ఆరోపించారు. రాయచోటి కలెక్టరెట్‌కు గ్రామస్తులు కలిసి వెళ్తున్నామని తెలిపారు.

## గాయత్రి దేవి అలంకారంలో విరుపాక్షమ్మ



**కల్లూరు, మే 12, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ దేవత శ్రీ విరుపాక్షమ్మ ఆలయంలో జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో తొలిరోజు ఆదివారం కలసస్థాపన, గణపతి పూజ, గణపతి హోమం నిర్వహించి పూజలు చేశారు. ఉభయ దారులు మువ్వల నరసింహులు శెట్టి, సతీష్ కుమార్ కుటుంబ సభ్యులు, మాదాస్ బ్రదర్స్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండవ రోజు సోమవారం గణపతి హోమం కాటయ్య వారిచే అభిషేకం, 108 కలసభిషేకం, జలాభిషేకం, నవధాన్య మొలకల పూజ జరిపారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఉభయ దారులుగా జగదీష్ పిలై కోమల దంపతులు, గురుమూర్తి నాయుడు కృష్ణమ్మ దంపతులు, కరుణాకర్ నాయుడు మాధవి దంపతులు పూజాపాల్గొన్నారు.ఆలయ ప్రధాన అర్చకులు మంజునాథ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

రొంపిచెర్ల, మే 12, ప్రభాతవార్త:



రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి సుధారాణి తెలిపారు. సోమవారం బొమ్మయ్యగారి పల్లి రైతు సేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్‌పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకులు వెంకటరమణ నాయక్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్‌ల వలన కలిగే లాభాలు, వాటి నష్టాలను తెలియజేశారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లను వ్యవసాయ సమాచారం కోసం అగ్రి సెంట్రల్ ప్లాన్ టిక్స్, ఎన్‌పీఎస్ఎస్ వంటి వ్యవసాయ యాప్‌ల వినియోగం, యూట్యూబ్ ద్వారా వ్యవసాయం చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు తెలియజేశారు. 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో ఉన్న వారు 10 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లయితే వారికి టాప్ త్రీలోని ముగ్గురికి శిక్షక రైతులకు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడవ బహుమతిగా రూ.8 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించి, సర్టిఫికెట్లు ప్రధానం చేయడంజరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎం.సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ నాయకులు ఎర్రయ్య మృతికి నివాళి



**రొంపిచెర్ల, మే 12, ప్రభాతవార్త:** వైఎస్ఆర్సీపీ నాయకులు, వార్డు మెంబర్ ఎర్రయ్య మృతికి ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్, రొంపిచెర్ల మండలం వైఎస్ఆర్సీపీ నాయకులు నివాళులర్పించారు. మండలంలోని చెంచమ రెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీ, ఆర్. బెస్తపల్లి కి చెందిన వార్డు మెంబర్ ఎర్రయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని వైఎస్సార్సీపీ నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ కాకులారం సుధారాణి, మాజీ సర్పంచ్‌లు రామనారాయణ రెడ్డి, సిబ్బాల రవీంద్ర, వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ కరీముల్లా, వైఎస్సార్సీపీ నాయకులు సూర్య నారాయణ రెడ్డి, శ్రీనాథ నాయుడు, అమరనాథ రెడ్డి, కుమార్ రెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మండల సముదాయ భవనాల్లో తేనెటీగలు హల్‌చల్

**సోమల, మే 12 ప్రభాతవార్త** సోమవారం కావడంతో మండల సముదాయ భవనాలలో అర్జీదారులు పలు సమస్యలతో వచ్చిన ప్రజలుతో కిటకిటలాడుతోంది. దగ్గరలో చింత చెట్టుపై ఉన్న పెద్ద తేనీగల తుట్టను ఎవరో కదిలించడంతో అవి ఒక్కసారిగా ప్రజలను చుట్టుముంటాయి. అన్నమ్మ గారి పల్లి వీఆర్వో ప్రసాద్ ముఖంపై కుట్టడంతో ఆయన ఆస్పత్రిలో చికిత్సలు పొందాడు. తేనీగల గుంపును గమనించిన ప్రజలు అధికారులు మండల పరిషత్, తాసిల్దార్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, అగ్రికల్చర్ కార్యాలయం, విద్యాశాఖభవనాలు,సచివాలయంలోచేరితలుపులువేసుకున్నారు.మధ్యాహ్నంమూడుగంటల నుంచినాలు గుగంటల వరకు తేనెటీగలు హల్‌చల్ చేయడం తో అధికారులు, ప్రజలు భవనాలకే పరిమితమయ్యారు.



## అభివృద్ధికి నోచుకోని ఎన్టీఆర్ గృహాలు

పూతలపట్టు, మే 12, ప్రభాతవార్త

2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో ఎన్టీఆర్ గృహాలు 990 గృహాలు మంజూరు కాగా 159 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 358 గృహాలు పునాదులు, స్లాబులు, పై కప్పు వంటి స్థాయిలలో నిలిచిపోయాయి. 2019 జగన్ హయాంలో 1785 పక్కా ఇళ్లకు 1366 పక్కా గృహాలు పూర్తిస్థాయిలో అన్ని పనులు కాగా మిగిలిన 298 గృహాలకు కూటమి ప్రభుత్వం రాగానే ఎస్సీ, బీసీ కులాలకు 50,000 రూపాయలు ఎస్టి కులాలకు 75 వేల రూపాయలు అదనంగా ఇస్తూ పక్కా గృహాల పనిని వేగవంతం చేయాలని కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తుంది. కానీ 2014 ఎన్టీఆర్ గృహాలకు 2019లో ఉన్న ప్రభుత్వం గానీ ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం గాని ఎన్టీఆర్ గృహాలపై దృష్టి సారించలేకపోవడం వల్ల పునాదులకు మొండి గోడలకు మోల్డింగ్ కూడా లేకుండా ఉన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అందువల్ల ఈ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ పక్కా గృహాలపై దృష్టి సారించి వాటికి కూడా సామాజిక బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన విధంగా నిధులు చేకూర్చి వాటి పనులను కూడా వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎన్టీఆర్ పక్కా గృహాలు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

## బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా భారతీ



**తొట్టంబేడు, మే 12 ప్రభాతవార్త** శ్రీవిద్యాప్రకాశనంద బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పి.భారతీ పదోన్నతిపై ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎఫ్ఏసి ప్రిన్సిపల్ రేణుకమ్మ చార్జి అందించారు. అనంతరం ఆమెకు మహిళా అధ్యాపకులు దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు.ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలి

– మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



***కుప్పంరూరల్, మే 12 ప్రభాతవార్త*** మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందేలా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మల్లానూరులో ప్రభుత్వ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరమ్మలు మహిళల కోసం ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. తొంభై రోజుల శిక్షణను అందరూ పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాగా వేసవి దృష్ట్యా శిక్షణకు హాజరయ్యే మహిళలు, చంటిపిల్లలకు తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శి రమ్యలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజగోపాల్, నేతలు రమేష్, దామోదర్, విభూషణ్, వెంకటాచలపతి, అన్నాదొరై, వెంకటప్ప, చిన్నదొరై, రాజ్‌కుమార్, సుధాకర్, కుట్టప్ప, సుభాష్ పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ యుజి సెమిస్టర్ ఫలితాలు విడుదల



**కుప్పం, మే 12 ప్రభాతవార్త** ద్రవిడ వర్సిటీలో యుజి 6వ సెమిస్టర్, పిజి నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను తొలిసారిగా సోమవారం ఆన్‌లైన్‌లో వర్సిటీ విసి ఆచార్య ఎం. దొరస్వామి విడుదల చేశారు. పరీక్షా ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ద్రవిడియన్ యూనివ ర్సిటీ. ఎసి.ఇన్‌లో తెలుసుకోవచ్చని రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా॥ హరికృష్ణ, డీన్ శ్రీనివాసకుమార్, కేశవమూర్తి, డిఆర్ మాధవనాయుడు పాల్గొన్నారు.

## చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతి

రామకుప్పం, మే 12 ప్రభాతవార్త



స్థానిక చెరువులో పడి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని గుర్తించినట్లు ఎస్సై వెంకటమోహన్ తెలిపారు. మృతి చెందిన మహిళ వయసు 65-70ఏళ్లు ఉంటాయన్నారు. ఎర్రగులాబీరంగు చీర, వంకాయపువ్వు రంగు పావడ, ఆకుపచ్చ, తెలుపురంగు పూసల హారం మెలో ఉన్నాయన్నారు. రెండు చేతులపై ముగ్గులను పచ్చబొట్లుగా వేయించుకుందన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే రామకుప్పం ఎస్సై 9440900703, రూరల్ సిఐ 9440796737నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## అక్రమంగా చెరువు మట్టి కర్ణాటకకు తరలింపు



***వి.కోట, మే 12 ప్రభాతవార్త*** వి.కోట పట్టణంకు సమీపంలో బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ముదిమడుగు చెరువుపై మట్టి మాఫియా కన్నుపడింది. దీంతో వాల్టా చట్టాన్ని సైతం ఖాతరు చేయక చెరువునుంచి మట్టిని కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. సోమవారం జెసిబి యంత్రం దా ్వరా చెరువులో ఉన్న మట్టిని ఎలాంటి అనుమతులు పొందకనే కొందరు ట్రాక్టర్లలో నింపి అక్రమంగా కర్ణాటకకు తరలించారు. చెరువులో మట్టి కోసం భారీగా గుంతలు తీస్తున్నారు. మున్ముందు వర్షాలు బాగా కురిసి నీళ్ల చెరువుకు చేరితే ఎక్కడ ఏ గుంత ఉందో చెప్పలేని పరిస్థితి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతులు ఆర్ఎస్‌కెలలో అప్రూవల్ పొందాలి

శాంతిపురం, మే 12 ప్రభాతవార్త

అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ది పొందేందుకు మండలంలో ఉన్న రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో అప్రూవల్ పొందాలని వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. భూమిలేని రైతులు, రాజ్యాంగబద్ధపదవిలో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, టా ్యక్స్ చెల్లింపుదారులు, రిటైర్డ్ పెన్షన్ పొందుతున్న వారు అనర్హులుగా గుర్తించి తొలగించడం జరుగుతుందన్నారు.



## నిదురపో స్వామీ నిదురపో...!

చౌడేపల్లి, మే 12 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రథమ శయనోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అబిషేక ప్రియుడిః ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాత్రి శయనోత్సవం జరిగిన తీరు భక్తులను అలరించింది. ఈ కార్యక్రమానికి జమీందారు వంశీయులు ఎస్.రాజేంద్ర రాయల్,రాజా రమేష్‌రాయల్, బసవరాజరాయల్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## అభయాంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

చౌడేపల్లి, మే 12 ప్రభాతవార్త



చౌడేపల్లి పరిధిలోని దొరబావితోట వద్దగల అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ నిర్మాణదాత పేరా అమరావతి ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు నాగరాజ ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు అమరావతి భోజన వసతి కల్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## రాజనాలబండపై పూజలందుకున్న క్షేత్ర పాలకుడు

చౌడేపల్లి, మే 12 ప్రభాతవార్త



సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండపై గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామితో పాటు క్షేత్ర పాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామి భక్తుల నుంచి పూజలందుకొన్నాడు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధానార్చాకుడు కృష్ణమూర్తిచే టిటిడివారి ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయంలో పూజలు నిర్వహించారు. పుంగనూరుకు చెందిన లార్మిక బండకు వచ్చిన భక్తులకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించారు.

## కూరపర్తివారిపల్లిలో శ్రీ ఆరెటమ్మ కళ్యాణ మండపం ప్రారంభం

**యర్రావారిపాలెం, మే 12, ప్రభాతవార్త:** యర్రావారిపాలెం మండల కూరపర్తివారిపల్లి గ్రామపంచాయతీలో పౌర్ణమి సందర్భంగా శ్రీ శ్రీఆరేటమ్మ తల్లికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్య నిర్వాహకులు రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మధు ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ అభినందించిన ఎమ్మెల్యే నాని సుమారు రూ.50 లక్షల రూపాయలతో అన్ని సౌకర్యాలతో ఈ ఫంక్షన్ హాల్ నిర్మించిన మధుకు అభినందనలు తెలిపారు. శ్రీ శ్రీ ఆరేటమ్మ తల్లి కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసి కార్యనిర్వహకులను అభినందించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాలు స్వీకరించారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

గుడుపల్లి, మే 11 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని గుడుపల్లిలో సోమవారం మహిళలకు టైలరింగ్ శిక్షణను మండల అధ్యక్షుడు బాబు నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను ప్రారంభించారన్నారు. గుడుపల్లి మండలంలో 140 మంది టైలరింగు శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, వారికి విడతల వారిగా శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం 9 నుండి 1 వరకు మధ్యాహ్నం 2 నుండి 6 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ రాధాక్రిష్ణ,ఇఓపిఆర్‌డి సద్గుణ,ఎపిఎం గ్రీటా మహిళలు పాల్గొన్నారు.

## తెదేపాలో చేరిన రిటైర్డు బ్యాంకు ఉద్యోగిని

చిత్తూరురూరల్, మే 12 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమక్షంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ చేసిన రాంనగర్ కాలనీకి చెందిన పిఎస్ లత తన కుటుంబసభ్యులతో కలసి తెలుదేశం పార్టీలో చేరారు. చిత్తూరులో ఎమ్మెల్యే ఆద్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిపనులు, తెదేపా విధి విధానాల తనకు నచ్చడంతో తాను పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, తెదేపా నాయకులు కాజూరు బాలాజీ, బాలాజీనాయుడు, తెదేపా,జనసేన నాయకులు పాల్గొన్నారు.

## విజయం డిగ్రీ కళాశాలకు 'స్వయంప్రతిపత్తి' హోదా

చిత్తూరురూరల్, మే 12 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, నాయుడు బిల్డింగ్స్‌లోని విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు యుజిసి ద్వారా స్వయంప్రతిపత్తి హోదా లభించినట్లు విద్యాసంస్థల అధినేత డా.ఎం. తేజోమూర్తి తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు సాధారణ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 2003లో స్థాపించిన విజయం డిగ్రీ కళాశాల క్రమేణ ఉన్నత విలువలతో కూడుకున్న విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ తృతీయ సంవత్సరంలోనే ఉపాధి చూపించడంతో పాటు అకడమిక్ ఫలితాలలో అద్భుత విజయాలను సాధిస్తూ యూనివర్శిటీ స్థాయిలో కళాశాల ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ఎంఎన్‌సి రంగాలలో ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థగా రాణించిందన్నారు ఈ ప్రమాణాలతో తమ కళాశాలకు 2022లో ప్రతిష్టాత్మకమైన నాక్ ఎ+ గ్రేడ్‌ను, 2024లో యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ నుండి 2(ఎఫ్) గుర్తింపు, 2025-26 విద్యాసంవత్సరంలో స్వయం ప్రతిపత్తిహోదా లభించడం అంకితభావం కలిగిన అధ్యాపక బృందం కృషితో సాధ్యమైందన్నారు. ప్రస్తుత ఎఐ విధానానికి అనుగుణంగా ప్రగతిశీల, ఆచరణాత్మక పాఠ్యాంశాలను పరిచయం చేస్తున్నామని, ఈ గుర్తింపు ద్వారా ఆధునిక ఉపాధి యోగ్యమైన విద్యను విద్యార్థులకు అందించే అవకాశం వుందని అకడమిక్ డైరెక్టర్ ఎం. శైలజామూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కండేయనాయుడు, రమణప్రసాద్, దేవేంద్రన్, రాజగోపాల్‌నాయుడు, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, మే 12 12 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, మే 12 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకు పూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరాములవారి రథోత్సవ ర్యాలీ



**కుప్పం, మే 12 ప్రభాతవార్త** స్థానిక శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేకం, ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీరాములవారి రథోత్సవ ర్యాలీని హిందుధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు నరేష్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ పురవీధుల్లో రథాన్ని బాణసంచా పేలుళ్ల మధ్య యువత ఉత్సాహంతో ఊరేగించారు. జైశ్రీరామ్, భారత్‌మా తాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం సుమారు ఐదువందలమందికి అన్నదానం చేశారు. భారత సరిహద్దుల్లో జరుగుతున్న యుద్ధంలో పాల్గొంటున్న సైనికులు, సరిహద్దు ప్రజలకు ధైర్యం, శక్తిని ప్రసాదించాలని ఆయన కోరారు. ప్రధాని మోడి నాయకత్వంతో మరింత ముందుకుసాగాలని స్వామివారిని ప్రార్ధించినట్లు తెలిపారు.

## పేటలో చిత్రాపౌర్ణమి సంబరాలు

శ్రీకాళహస్తిరూరల్,మే 12 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో చిత్రాపౌర్ణమి సంద ర్భంగా అంకమ్మ,భద్రకాళి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమా లు,సంబరాలు నిర్వహించారు. అర్జున్‌బాబు సారధ్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేటలోని భద్రకాళి ఆలయంలో వెలసిన అమ్మవారికి పరమేశ్వరి విశ్వరూపం అలంకారం జరిపి భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా భజన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.అలాగే ఉదయం పాలగెరిగే ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

## కన్నుల పండువగా గరుడ సేవ

శ్రీకాళహస్తిరూరల్,మే 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గరుడ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం తిరువాచ్చిలో దర్శనం ఇచ్చిన చెన్నకేశవ స్వామి రాత్రి గరుడ సేవను నిర్వహించారు ఉత్సవాన్ని చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యపర్యవేక్షణలో ఆలయ అర్చకులు నిర్వహించారు.ఈ ఉత్సవాలపర్యవేక్షణకు ఎఇఓ హేమామాలిని నియమించారు.స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించి గరుడవాహనంపై ప్రతిష్టించి నాలుగుమాడావీధుల్లో ఊరేగించారు.ఈ ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.ఉత్సవంలో ఎపాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో కోనసీమ కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్,మే 12 ప్రభాతవార్త



గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని స్వామిని సోమవారం కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ ఆయన సతీమణి మహేష్ నివేదిత కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఇఓ రామచంద్రారెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. మాజీ చైర్మెన్ బత్తలగిరినాయుడు వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## ముచ్చివోలులో ఆధార్ నమోదు

శ్రీకాళహస్తిరూరల్,మే 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ముచిచ్చవోలు గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ నమోదు కార్యక్రమాలను చేపట్టినట్లు సచివాలయ కార్యదర్శి వినోద్ కుమార్ సోమవారం తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ తమ పేర్లు తప్పుగా నమోదైనా సరిదిద్దుకునే అవకాశం కల్పించబడిందన్నారు. ఇక పసిబిడ్డలకు ఆధార్‌కార్డులను నమోదు చేసుకోవచ్చునని వివరించారు. సోమవారం మండుటెండల్లో కూడా ఎర్రగుడిపాడు గిరిజనులు తరలివచ్చి తమ పేర్లును ఆధార్ కార్డులకు నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ మురళి, శ్రీనివాసులు, విఆర్ఓ పూర్ణిమ మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష,ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

## చిన్నసింగమాలలో శరవేగంగా జరుగుతున్న రీసర్వే

తొట్టంబేడు, మే 12 ప్రభాతవార్త



మండలంలోని చిన్నసింగమాలలో రీసర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల సర్వేయర్ హరనాథ్ ఆధ్వర్యంలో విఆర్ఓ లహరి, సచివాలయ సర్వేయర్లు రాఘవ తదితరులు మండుటెండలో సైతం విధులు నిర్వహిస్తూ రీసర్వేను చేస్తున్నారు.పైలట్ ప్రాజెక్టుగా కొన్నలి గ్రామం ఎంపికైన విషయం విదితమే ఈనేపధ్యంలో మండలంలో సర్వేపూర్తయినా విఆర్ఓ లాగిన్ జరుగుతోంది. చిన్నసింగమాల, కళ్ళిపూడి గ్రామాల్లో ప్రస్తుతం రీసర్వే జరుగుతోంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీసర్వేను నిర్వహిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు రీసర్వే మంచి అవకాశమని దీన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ హరనాథ్ కోరారు.

## ఏరియా ఆస్పత్రిలో ఘనంగా నర్సుల దినోత్సవం

***శ్రీకాళహస్తి, మే 12 ప్రభాతవార్త*** పట్టణంలోని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో నైటింగేల్స్ జన్మదినాన్ని



పురస్కరించుకుని ప్రపంచనర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కోనేటిమణి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో ఉన్ననర్సులందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏ ఆస్పత్రిలో అయినా వైద్యులకన్నా తొలుత నర్సులదే కీలకపాత్ర అని అన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మణి మాట్లాడుతూ ఎవరైనా రోగులను తాకాలంటేనే వెనుకంజవేస్తారు. కనీసం వారి వద్దకు కూడా రారు. అలాంటి వారిని చేరదీసి వారి రోగాన్నినయం చేసి లేడీ విత్‌ది లాంప్ గా పేరెన్నికగన్న ఫ్లోరెన్స్‌నైటింగేల్ జన్మదినం నేడు. నేడు అన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోను, నర్సింగ్ కళాశాలల్లోను 'ప్రపంచ నర్సుల దినోత్సవం'ను జరుపుకుంటున్నారు. ఆమె స్ఫూర్తితోనే ఆస్పత్రిలో వైద్యులు తమ విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ విజయలక్ష్మి, పలువురు స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులు... వర్ధమాన ఉద్యోగులకు నిర్దేశకులు

రేణిగుంట, మే 12 ప్రభాతవార్త



రైల్వే విశ్రాంత ఉద్యోగులు వర్ధమాన ఉద్యోగులకు మార్గ నిర్దేశకులని రేణిగుంట (తిరుపతి) సిఆర్ఎస్‌సి డబ్ల్యూ ఎం.దేవ సహాయం అన్నారు. రేణిగుంట సిఆర్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి ఏ ఐ ఆర్ ఆర్ ఎఫ్ జాతీయ నాయకులు శ్రీధర్ సోమవారం వచ్చారు. ఆయనకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయపూర్‌లో నిర్వహించిన సభలకు శ్రీధర్ నాయకత్వం వహించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రసంగించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి రాజస్థాన్ గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నందుకుగాను శ్రీధర్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. విశ్రాంత ఉద్యోగులు అపూర్వ ప్రజ్ఞా వంతులుగా అభివర్ణించారు. వారి అనుభవాలను వర్తమాన ఉద్యోగులు గుర్తించి వారి సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్ కుమార్, వర్కింగ్ చైర్మన్ గజపతి నాయుడు, కోశాధికారి కృష్ణ దాస్, ఎస్కే జబ్బర్, కేకే రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సులు చేస్తున్న సేవలు అమోఘం: వినుత కోట



*రేణిగుంట, మే 12 ప్రభాతవార్త* సమాజంలో నిష్పక్షపాతంగా నర్సులు చేస్తున్న సేవలు అద్వితీయమని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి కోట వినుత అన్నారు. రేణిగుంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని నర్సులను అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా సోమవారం జనసేన ఆధ్వర్యంలో నర్సులకు మిఠాయిలు పంచిపెట్టి అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినుత కోట మాట్లాడుతూ ప్రతి రోగికి నర్సులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారన్నారు. వైద్యులు లేని సమయంలో రాత్రనకా పగలనకా కష్టపడేది నర్సులు మాత్రమే అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడిన మాతృమూర్తులు నర్సులు అన్నారు. జనసేన నాయకులు కోట చంద్రబాబు, నగరం భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:

మండల పరిధిలోని అగరాల వద్ద సోమవారం వేకువజామున రోడ్డుదాటుతున్న దోనెపల్లి కేశవులు (45)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు అగరాల, వినాయక నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడుగా గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కేశవులు మృతదదేహం వద్ద బోరున విలపించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తొండవాడ టిడిపి గ్రామకమిటీ అధ్యక్షుడుగా

### సిద్దారెడ్డి గారి ఉమాపతిరెడ్డి



చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:

తొండవాడ టిడిపి గ్రామకమిటీ అధ్యక్షుడుగా సిద్దారెడ్డి గారి ఉమాపతి రెడ్డి మరోమారు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. తొండవాడలో సోమవారం పార్టీ టిడిపి నాయకుల సమక్షంలో గ్రామకమిటీ ఎంపికలు నిర్వహించారు. గ్రామకమిటీ అధ్యక్షుడుగా సిద్దారెడ్డి గారి ఉమాపతి రెడ్డి, కార్యదర్శిగా వావిలూరు రాఘవేంద్ర యాదవ్, ఉపాధ్యక్షుడుగా డి.సుదర్శన్ నియమితులయ్యారు. ఉమాపతి వరుసగా నాలుగు పర్యాయాలు అధ్యక్షుడుగా ఎంపిక కావడం విశేషం. ఈ క్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసి రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, మొక్కల కుమార్ రాజా రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రఘు యాదవ్, శంకరయ్య, బాలకిషోర్, చెరుకూరి చేఖర్, లోక ఆచారి, పరశురామయ్య, పృధ్వీ, రవిచంద్ర, తదితరులు అధ్యక్షుడు, కార్యదర్శిలకు అభినందలు తెలియజేస్తూ, ఘన సన్మానం చేశారు.

## పాడితోనే రైతుల ఆర్థికాభివృద్ధి

### టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, మే 12 ప్రభాతవార్త:



పాడి పశువులతోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. సోమవారం కుప్పం బాదూరు, నెన్నూరు పశువైద్య కేంద్రాలలో సబ్సిడీ పశువుల దాణాను పశువైద్యాధికారులు హేమకుమార్, జై కిషోర్ రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆహార భద్రత పథకంలో భాగంగా 50 శాతం సబ్సిడీ రూ.1100/-లు విలువ గల 50 కేజీల దాణా బస్తా రూ.550/-లకే ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదట ఎస్సీ ఎస్టీ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో పశువుల దాహార్తి తీర్చడానికి ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా 80 నీటి తొట్టెలు నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోరా హరిప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ తెలుగుయువత కార్యదర్శి లెక్కల సురేంద్ర నాయుడు, నాయకులు లెక్కల మహేష్ నాయుడు, ధనంజయ రాయల్, ప్రకాష్ యాదవ్, కుప్పారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి..!

### ఎంపిపి ఏ.వి.బ్రహ్మానంద రెడ్డి

రామచంద్రాపురం, మే 12 ప్రభాతవార్త:




మండలంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఈ పవన్‌కుమార్ రాజుకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటిసి ఢిల్లీరాణి, ఎంపిడిఓ ఇందిర, తహశీల్దార్ వెంకటరమణ, వైస్ ఎంపిపి లావణ్య, ఎంపిటిసిలు చంద్రశేఖర్ రెడ్డి, మునీంద్ర యాదవ్,మంజుల సిద్దారెడ్డి, కృష్ణవేణమ్మ, సర్పంచ్‌లు మురగయ్య, హిమాల్ రెడ్డి, భారతి, పాల్గొన్నారు.

## శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆశీస్సులతో

### సామూహిక సత్యనారాయణ వ్రతం , ఆలయ చైర్మన్ ఓంకార్ భరద్వాజ్

చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:



స్థానిక కొత్తపేటలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆశీస్సులతో సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ ఓంకార్ భరద్వాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గౌతమ్ శర్మ మాట్లాడుతూ వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## శిఖర ప్రతిష్టలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,మే 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేటలో నూతనంగా నిర్మించిన కావమ్మ, మారయ్య ఆలయ విగ్రహ ప్రతిష్ట మహాకుంబాభిషేకంలో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఆలయ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమని ఇక్కడ ప్రతి వీధికి ఆలయం నిర్మించటం భక్తిభావాన్ని కల్పించటం అభినందనీయం అన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్థానికులు ఆయనను సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో బుల్లెట్ శ్యామ్‌రాయల్, కళ్యాణి, ప్రకాష్,శివ, గుణ, శ్రీవారి సురేష్, మున్నారాయల్, ఉత్తరాజి శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, పిఎం చంద్ర, వేడాం బాలిరెడ్డి వెంకటేశ్వర్లు నాయుడు, జివికె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో రాజనగరం ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,మే 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిట కిట లాడింది. పౌర్ణమి సోమవారం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు జరిపించుకున్నారు. అంతేకాక విఐపిల తాకిడి కూడా పెరిగింది. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం శాసనసభ్యుడు బత్తలబలరామకృష్ణ కుటుంబసభ్యులతో శివయ్య దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఒ సతీష్‌మాలిక్ పిఆర్ఓ రవి సారధ్యంలో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. తీర్థ ప్రసాదాలను సతీష్‌మాలిక్ అందించారు.

## ఎస్వీయూ ఫిజిక్స్ విద్యార్థికి విదేశాల్లో పరిశోధనకు అవకాశం



**తిరుపతి విద్య మే 12 ప్రభాత వార్త** ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేసిన సిహెచ్ బ్రహ్మరెడ్డి అనే విద్యార్థికి విదేశాల్లో పరిశోధన చేయడానికి అవకాశం లభించింది.దీంతోపాటు నెలకు రూ.లక్ష రూపాయలు స్కాలర్షిప్ ఆయన అందుకోనున్నారు.పూసన్ నేషనల్ యూనివర్సిటీలోని కెమికల్ మెటీరియల్స్ డిపార్ట్మెంట్లో ఆయన పరిశోధన చేయనున్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు,ఫిజిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు అభినందించారు. ఈ విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు కలగాలని వారు ఆకాంక్షించారు.

## ధ్యానంతో ఉల్లాసం, ఉత్సాహం



**పుత్తూరు రూరల్, మే 12 ప్రభాతవార్త:** పుత్తూరు పిరమిడ్ స్పిరిట్యుయల్ సొసైటీ ఆధ్వర్యంలో త్రినేత్ర పిరమిడ్ పుత్తూరులో ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు వారిచే 11 రోజులు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహించారు. సోమవారం ముగింపు క్యాంపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గీతాచార్య, యడ్లపల్లి మోహన్‌రావు హైదరాబాద్, జూనియర్ ఇంజనీర్ యూ.చంద్రశేఖర్,తిరుపతి రైల్వే జి.బి.ప్రసన్న, ఆర్‌కేసీ ఇ.రుకేష్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు పిరమిడ్ స్పిరిట్యుయల్ ట్రస్టు ప్రెసిడెంట్ జి.బి.ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులు పుట్టినప్పుడు నుంచి అనంతమైన శక్తిసామర్థ్యంను కలిగి ఉంటారని, కానీ వారు ఎదిగే కొద్ది ఒక్కొక్క దశలో సమాజం నుంచి మరి వారి చుట్టూ ఉన్న వారి నెగిటివ్ ప్రభావం వల్ల అవి వారిలో ఉన్నాయన్న ఎరుక కోల్పోయి వాటిని వినియోగించుకోలేక పోతారు. అంతే కాకుండా వారు తమ గురించి లేనిపోని అపోహలను, భయాను ఊహించుకుని జీవితాన్ని బాధాకరంగా జీవిస్తూ ఉంటారు. ధ్యానం చేసి వారిలో ఎప్పటి నుంచో పాతుకుపోయి ఉన్న గుడ్డి నమ్మకాలు, అపోహలు, భయాలు అన్ని తొలగిపోయి జీవితాన్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవిస్తూ అద్భుతమైన విజయాలను సాధిస్తారని తెలిపారు. అనంతరం పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, టోపి, శ్వాస విజ్ఞాన జ్యోతి బుక్స్ అందజేశారు.పిల్లల తల్లిదండ్రులు, పిరమిడ్ మాస్టర్లు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎం.ఎస్.సుజాత, ప్రెసిడెంట్, టీమ్ సభ్యులు, ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డి.నాగరాజు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం మన చేతిలో

పుత్తూరు రూరల్, మే 12 ప్రభాతవార్త:



మన దేశం కోసం పోరాడి వీర మరణం పొందిన మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ విశ్రాంత భవనంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి తీర్మానించగా సభ్యులు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. 50 సంవత్సరాల దాటిన వారికి ఎముకల సమస్యలు ఎక్కువగా ఉంటాయని, ఇందుకు కారణం విటమిన్ డీ3, కాల్షియం లోపం అన్నారు. శ్రీ చక్ర ఆస్పత్రి ఆర్థో వైద్యులు రాజేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలోజరిగిన సర్వసభ్య సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎముకల సమస్యల నివారణకు మంచి ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని ముఖ్యంగా గుడ్లు, చేపలు, కోడి మాంసం, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. యోగ, నడక వలన మంచి కండరాల కిగి ఉంటే మన జీవన ప్రమాణం 10 శాతం పెరుగుతుందన్నారు. మరో ఫిజియోథెరపిస్టు కల్యాణ్ మాట్లాడుతూ కీళ్ళ సమస్యలు ఎక్కువగా డయోబెటిస్, పడడం వలన వస్తుందన్నారు. కావున వ్యాయామం వల్ల వీటిని అధికమించవచ్చన్నారు. విశ్రాంత భవన నిర్మాణానికి వి.వెంకట్రామయ్య 50 వేలు చెక్‌ను, రామలింగం, మార్టిన్, రాధాకృష్ణ, టి.వి.రమేష్, కె.కుప్పయ్య కలిసి వేదికకు మైక్ పోడియం, వాటర్ ఫీల్టర్ అధ్యక్షులచే అందజేశారు. అనంతరం హాజరైన వారికి ప్రధాన కార్యదర్శి కుప్పయ్య భోజన వసతి కల్పించి వందన సమర్పణ టి.వి.రమేష్ చేయగా జాతీయ గీతం ఆలాపనతో సభ ముగిసింది. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, వెంకటకృష్ణ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం, అరుణాచలం, నిర్మలా జయకుమారి, శంకరయ్యలు పాల్గొన్నారు.

## చురుగ్గా టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు

విజయపురం, మే 12 ప్రభాతవార్త:



విజయపురం మండల పరిధిలో ఆయా టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, అనుబంధ కమిటీల ఎన్నికలు గత రెండు రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో ప్రతి గ్రామంలోను పార్టీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహిస్తున్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశానుసారం మండల పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులుగా ధనంజయ నాయుడు, మణిరాజు, మీర, జానా వెంకటయ్య తదితరులు హాజరై గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఇందులో భాగంగా సోమవారం మల్లారెడ్డి కండ్రిగ, నారపరాజు కండ్రిగ, శ్రీహరిపురం, మహారాజపురం గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో నగరి మార్కెట్ కమిటీ చైర్మన్ రాజమ్మ, పార్టీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం రాజు, బాబుయాదవ్, దశరథరాజు, రాఘవరాజు, సురేష్‌బాబు, లోకేష్‌రాజు, ప్రకాష్ యాదవ్, శేఖర్‌శెట్టి, నాధముని, భాస్కర్, సతీష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన డిపిటిఓ

తిరుపతి(రవాణ),మే 12 ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలో చంద్రగిరి వద్ద ఆదివారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం సాయంత్రం తిరుపతి జిల్లా డిపిటిఓ కె. వెంకటరావు పరామర్శించారు. ఆయన నేరుగా రుయా క్యాజువాలీటికి చేరుకుని క్షతగాత్రులను,. బాధితులను పలకరించారు. మెరుగైన వైద్యంకోసం ఆర్టీసి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఆర్టీసి డిసిఎం ట్రాఫిక్ పి.విశ్వనాథ్, తిరుపతి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## సాయిబాబా ఆలయంలో టీడీపీ నాయకులు పూజలు



**కేవీబీ పురం, మే 12 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధ్య క్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ జన్మదినం సందర్భంగా కేవీబీ పురంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జన్మదిన కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, కేవీబీ పురం మండలక్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామి యాదవ్, తిరుపతి పార్లమెంట్‌రైతు అధ్యక్షులు గోపినాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, ఓలూరు సర్పంచ్ సురేష్ చౌదరి, పవన్‌వారికండ్రిగ సర్పంచ్ చెంచు ప్రకాష్ యాదవ్, రాజులకండ్రిగ సర్పంచ్ వెంకటేష్ యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూరమాల ఆయకట్ట చైర్మన్ రాజారెడ్డి, యువత అధికార ప్రతినిధి లోకేష్‌చౌదరి, పాలయకరిసంఘం అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, ఏపీ మోడల్ స్కూలు వైస్‌చైర్మన్ మునికృష్ణ, మాజీ సర్పంచ్ బత్తయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగులను గుర్తించండి సీఎం సారూ...



**సత్యవేడు, మే 12 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గంలో రాష్ట్రం దేవాంగ కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి త్వరలో డైరెక్టర్లను నియామకం చేయాలని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు సీఎం చంద్రబాబునాయుడుకు మెయిల్ ద్వారా విన్నవించుకున్నారు. సత్యవేడు మండలంలో రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలో అన్ని కులాలకు కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిందని, దేవాంగ సంఘ కార్పొరేషన్‌ను కూడా జాప్యం లేకుండా త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు మెయిల్ ద్వారా విన్నవించుకున్నట్లు తెలియజేస్తూ, ఈ విషయాన్ని గతంలో అనేక సార్లు రాష్ట్రకేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకుని వెళ్లినట్టు ప్రస్తావించారు.దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కో-కన్వీనర్ జక్కుల శివానందం పాల్గొన్నారు.

## కార్మిక సమ్మెకు సంసిద్ధం కండి : సీఐటీయూ



***సత్యవేడు, మే 12 ప్రభాతవార్త:*** కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్లను రద్దు చేయాలని 2025 మే 20వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు సంసిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురించిన బుక్‌లెట్లు సోమవారం సత్యవేడు మండల కేంద్రంలోని ఆటో యూనియన్ కార్మికులకు పంచారు. ఈ కార్యక్రమంలో భాగంగాసీఐటీయూ నాయకులు మెలుగు రమేష్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత పార్లమెంట్‌లో తమకున్న బ్రూత్ మెజారిటీతో లేబర్ కోడ్స్‌కు ఆమోద ముద్ర పొంది కార్మిక హక్కులకు రక్షణ లేకుండా శ్రామిక వర్గాన్ని అణచడానికి తమ దోపిడీని తీవ్రతం చేయడానికి పాలకవర్గంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్లను తెచ్చిందన్నారు. 29 కార్మిక చట్టాను మార్చి 2019లో వేతనాలకు 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్ సామాజిక భద్రత కోడ్ వృత్తి భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్‌ని తెచ్చింది. ఈ లేబర్ కోడ్ అమల్లోకి వస్తే 29 కార్మిక చట్టాలు రద్దవుతాయి. యజమానులకు రక్షణ కార్మికులకు తీవ్ర శిక్షలుగా చట్టాలన్నీ మారుస్తున్నారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని మే 20 దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు కార్మిక వర్గం సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పన్నీరు మోహన్‌బాబు, వినోద్, షణ్ముగం, ఏళుమలై, సురేంద్ర, బాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చింత కాల్వ సమస్యకు పరిష్కారం

**వడమాలపేట, మే 12 ప్రభాతవార్త:** దశాబ్దాలుగా రోడ్డు లేక అవస్థపడుతున్న చింత కాల్వ గ్రామస్తుల సమస్య నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో పరిష్కారమైంది. పత్తి పుత్తూరు నుంచి చింత కాల్వకు ఉన్న రోడ్డు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక గుంతలమయంగా తయారైంది. చింతకాల్వ గ్రామస్తులు ఎన్నో పర్యాయాలు అధికారుల, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. ఎన్నికల ప్రచారంలో చింతకాల్వకు వచ్చిన గాలి భానుప్రకాష్‌కు గ్రామస్తులు తమ సమస్యను వివరించారు. కచ్చితంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు 70 లక్షలు మంజూరు చేయించి సిమెంటు రోడ్డు నిర్మించారు. పత్తి పుత్తూరు-చింత కాల్వ రోడ్డును నగరి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, వెంకటయ్య, రవినాయుడు, లక్ష్మీప్రసన్న, హేమావతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఓటేరు టిడిపి అధ్యక్షుడుగా మోహన్



**తిరుపతిరూరల్, మే 12 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం ఓటేరు గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షుడు మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రంగయ్య, ఉపాధ్యక్షుడుగా పులిపాటి లోకేష్ చౌదరిని ఎన్నుకున్నారు. నూతనంగా టిడిపి అధ్యక్షుడైన మోహన్ మాట్లాడుతూ ఓటేరు గ్రామ పంచాయతీలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తానిని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి బలపరిచిన అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. ఓటేరులో టిడిపి నాయకులను, కార్యకర్తలను ఏకం చేసి, క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడు చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన డిపిటిఓ వెంకటరావు

తిరుపతి(రవాణ),మే 12 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా ప్రజారవాణ అధికారిగా డిపిటిఓగా బాధ్యతలు చేపట్టిన కె. వెంకటరావు సోమవారం ఉదయం తిరుపతి జిల్లా అధికారులను కలిశారు. ఆర్టీసి డిసిఎం ట్రాఫిక్ పి.విశ్వనాథ్, తిరుపతి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను, సంయుక్త కలెక్టర్ శుభంబన్సాల్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలతో వారిని కలసి తిరుపతి జిల్లాలో ఆర్టీసి అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు.

## ఘనంగా చిత్ర పౌర్ణిమ పూజలు-పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, మే 12 ప్రభాతవార్త :

సోమవారం చిత్ర పౌర్ణమి పండుగను పుర్కరించుకొని మండలలోని భీమునిచెరువు గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాలుని ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రాత్రి 7గంటలకు పాల్గొని పూజలను చేశారు. మహిళా భక్తులు ఆలయం వద్దకు చేరుకోని స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించుకున్నారు. ఎమ్మెల్యేను ఇంచార్జ్ సర్పంచ్ డి.ఆరుముగం, మాజీ సర్పంచ్ కె సుధాబాబు దుశ్శాలువతో సత్కరించారు.

## టిటిడి కల్యాణ మండపం పనులను ప్రారంభించండి

### టిటిడి ఇఓకి ఎమ్మెల్యే వినతి

***నారాయణవనం, మే 12 ప్రభాతవార్త :*** సత్యవేడులో టిటిడి కల్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి ఏర్పడిన అవరోధాలు తీరాయని, తెలుగు గంగ అధికారులు మండపం నిర్మించడం కోసం రాత పూర్వకంగా అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టిటిడి ఇఓ శ్యామలరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో సోమవారం ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ గతంలో సత్యవేడులో టిటిడి కల్యాణ మండపం నిర్మాణం కోసం భూమిపూజ చేయడం జరిగిందన్నారు. అయితే అప్పట్లో తెలుగుగంగ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఆగిపోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం కల్యాణ మండపం నిర్మాణానికి సంబందించి తెలుగు గంగ అధికారులు పూర్తిగా అంగీకారం తెలిపి వ్రాత పూర్వకంగా వ్రాసి ఇవ్వడం జరిగిందన్నారు. కావున టిటిడి అధికారులందరు సహకరించాలని కోరారు.

## అంకాళమ్మకు ఆరణి మదన్ పూజలు

తిరుపతి(రవాణ),మే 12ప్రభాతవార్త:



అమ్మవారి జాతర వేడుకల్లో భాగంగా జనసేన నేత ఆరణి మదన్ సోమవారం ఉదయం అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకుఅన్నదానం చేశారు. ఆయనతోబాటు జనసేనేతలు ఎస్‌కె బాబు, రుద్ర కిశోర్, కొండరాజు, హేమకిశోర్, బాలాజీ, సూర్యకుమారి ఉన్నారు.

## వేసవి శిక్షణా శిబిరాలకు క్రీడా పరికరాలు పంపిణీ

తిరుపతి క్రీడ, మే 12, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన వేసవి శిక్షణా శిబిరములకు క్రీడా పరికరాలను కోచింగ్ క్యాంప్ ఇన్చార్జిలకు సాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో ఆసక్తి గల క్రీడాకారు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడలలో తర్ఫీదు పొంది ఆరోగ్యంను పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంకు ఇంచార్జి డిఎస్‌డిఓ, డిఎస్ఏ కోచ్‌లు, స్టాఫ్ పాల్గొన్నారు.

## తిరుపతిలో ఎస్‌నిక్కర్ హోమ్ సర్వీస్ యాప్ ప్రారంభం

**తిరుపతి హెల్త్, మే 12 ప్రభాతవార్త ః** తిరుపతి ఎస్‌నిక్కర్ హోమ్ సర్వీస్ యాప్‌ను టీడీపీ నేత జెబి శ్రీనివాసులు, యాప్ సృష్టికర్త కృష్ణ చైతన్య ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఒక మిస్డ్ కాల్ ద్వారా ఇంటిలోని టాయ్‌లెంట్స్, ఏసీలు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, అన్ని రకాల రిపేర్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ యాప్‌ను ప్రారంభించిన రోజు నుంచి మే 15 వ తేది వరకు ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్‌ను అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ తేదీల్లో బుక్ చేసుకున్న కస్టమర్లు, గృహ యజమానులకు ఉచిత సర్వీసును ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే యాప్ ద్వారా మంచి సర్వీసును అందిస్తామని చెప్పారు. మరింత సమాచారం కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఎస్ఎన్ఐసికేఆర్.కామ్‌ను సందర్శించవచ్చునని, గూగుల్ ప్లేలో యాప్ స్టోర్‌నుఎస్ఎన్ఐసికేఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7799466684ను సంప్రదించవచ్చునన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can

కుప్పం శాఖ, కుప్పం, సెల్:73829 32202, 70328 77760

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు తేది: 02.05.2025

రుణగ్రహీత: శ్రీ సి.హెచ్.పోతురాజు తండ్రి కోటేశ్వరరావు, డి.నెం.13-295, రాధాక్రిష్ణ రోడ్డు, కుప్పం మండలం - 517424

హామీదారు: శ్రీ బి.జి.నాగార్జున తండ్రి బి.గోవిందరాజులు, డి.నెం.5/69, నేతాజీరోడ్డు, పాతపేట, కుప్పం, కుప్పం - 517425

అయ్యా/ అమ్మా !

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు మా కెనరాబ్యాంక్, కుప్పం శాఖ, నుండి మీరు శ్రీ సి.హెచ్.పోతురాజు తండ్రి కోటేశ్వరరావు గారు కాలానుగుణంగా పొందిన లోన్స్/ రుణ సౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | రుణం మొత్తం & ఖాతా నెంబరు | తేది: 29.04.2025 నాటికి బకాయిమొత్తం | వడ్డీ రేటు |
| --- | --- | --- | --- |
| హౌసింగ్ లోన్ | రూ.7,00,000/- 2714619015041 | రూ.1,74,550.30 | 11.10% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని **తేది: 29.04.2025** నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.1,74,550.30 (ఒక లక్ష డెబ్బై నాలుగు వేల ఐదు వందల యాభై రూపాయల ముప్పై పైసలు మాత్రమే)** లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపబడమైనది.**

చిత్తూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కుప్పం సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, కుప్పం మండలం, కుప్పం గ్రామ పంచాయతీ 6వ బ్లాక్,6వ వార్డు, పైబాట గుడిపల్లి రోడ్డు, సర్వేనెం.16-10 లోని డి.నెం.6-135 గల ఇంటికి సమీపంలోని చౌడేశ్వరమ్మ లేఅవుట్‌లోని ఖాళీ స్థలానికి హద్దులు: ప్లాటు నెం.3 గల ఖాళీస్థలానికి కొలతలు: తూర్పు - పడమర: - 50అ. (15.24మీ.) ఉత్తరం -దక్షిణం 20అ (6.09మీ.) = 1000చ.అ. = 111.11 చ.గ. ఇందుకు హద్దులు: తూర్పు: రాధాక్రిష్ణప్ప ఖాళీ స్థలం, పడమర: 15అ. కామన్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.4 ఖాళీ స్థలం, దక్షిణం: ప్లాటు నెం.2 ఖాళీ స్థలం. **టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ సి.హెచ్.పోతురాజు తండ్రి కోటేశ్వరరావు**

స్థలం : కుప్పం సం|| అధీకృత అధికారి,

తేది: : 2.05.2025 కెనరా బ్యాంక్

# సమయపాలన లేక ఆర్టీసీ డిపో అధోగతి

- ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



సూళ్లూరుపేట, మే 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో సమయ పాలన లేకపోవడం, పనిచేస్తున్న కార్మికులు బాధ్యతా యుతంగా పనిచేయకపోవడంతో ఆర్టీసీ డిపో అధోగతి పాలవు తుందని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో పనితీరుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. సమయ పాలన పాటించకపోవడం, ఉన్న సర్వీసులను సక్రమంగా నడపక పోవడం వంటివి డిపోలో జరుగుతున్నాయని అన్నారు. ఆయన స్వయంగా 11 గంటలకు ఆర్టీసీ డిపోకి వచ్చినప్పటికీ కొంతమంది ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఉద్యోగులు ఓడిలో ఉండటంపై ఆయన ఆర్టీసీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనిచేసే ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం, ఇందుకు తగినట్లుగా ఓడిలు తీసుకుంటే డిపో పనితీరు ఎలా మెరుగవుతుందని ఆయన ప్రశ్నించారు. డిపోలో గతంలో 60కిపైగా ఉన్న సర్వీసులు ప్రస్తుతం 29కి రావడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. శ్రీహరికోట, బెంగళూరు మధ్య సర్వీసులు ఎందుకు నడపడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం లేకపోవడం, కలెక్షన్లు వచ్చే రూట్లలో బస్సులు తిప్పకపోవడం, సూళ్లూరుపేట నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు ఎందుకు బస్సులు నడపడం లేదని ఆరా తీశారు. ఈ విషయాలు అన్నింటిపై ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు నివేదిక తయారు చేసి అందజేస్తామన్నారు. అనంతరం ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండును పరిశీలించి బస్టాండులో పరిశుభ్రత సక్రమంగా లేదని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి రెండవ శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా, ఎందుకు చేయడం లేదని సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అధికారులను అడిగారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, ఆదినారాయణరెడ్డి, అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్, సాగర్, బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాగపీఠ స్థాపనకు భూమిపూజ



కోట, మే 12 ప్రభాతవార్త: మండలం చిట్టేడులోని శ్రీరాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో సోమవారం నాగశక్తి పీఠ స్థాపనకు భూమిపూజ నిర్వహించారు. శ్రీచిదానంద మహారాజ్ దేవ ప్రయోగ నాగశక్తి పీఠం ఉత్తరాధికారి ఖరకములచే భూమిపూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు యజ్ఞ యాగం నిర్వహించి పూజలు చేశారు. రాబోయే రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం సుధాకర్, ఈగా రాజరత్నం, కోటయ్య, విజయశంకర్, వెంకటేశ్వర్లు, దారా సుబ్బరామయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి

కోట, మే 12 ప్రభాతవార్త : మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం పెన్నక్క చెరువు ఆయకట్టు రైతులకు నీటి పారుదల శాఖ ఇంజినీర్లు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నేదురుమల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ పెన్నక్క చెరువు కింద రిజిస్టర్ ఆయకట్టు రైతులు ఉన్నారని గుర్తు చేశారు. చెరువు ఆయకట్టు పరిధిలో 4,500 ఎకరాలని తెలిపారు. ఈ చెరువులో 9 నెలలు మాత్రమే నీళ్లు ఉంటాయని పేర్కొన్నారు. అయితే అధికారికంగా ఆయకట్టు రైతులు ఈ నీళ్ల ఉపయోగించాల్సి ఉండగా, అనధికారికంగా మరో వెయ్యి వెయ్యి ఎకరాలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని వాడుకుంటు న్నందున అసలైన ఆయకట్టు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే ఆయకట్టు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు సమగ్రంగా సర్వే చేసి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతుల మధ్య వివాదాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

## బాలసదన్‌లో పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

కోట, మే 12 ప్రభాతవార్త : కోటలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదన కింద పోస్టులు భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని బాలసదన్ సూపరింటెండెంట్ దుర్గాదేవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కుక్, నైట్ వాచ్‌మెన్, ఎడ్యుకేటర్, పిఇటి, యోగా పోస్టులకు అర్హులు దరఖాస్తులు చేసుకో వాలన్నారు. ఈ నెల 20వ తేదీ దరఖాస్తులకు గడువుగా తెలిపారు. మరిన్ని వివరాలకు 9553899070 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## ఎంపిడిఓకి ఘన సన్మానం



కోట, మే 12 ప్రభాతవార్త: ఇటీవల కోట ఎంపిడిఓగా దిలీప్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆ మేరకు సోమవారం ఎంపిడిఓ దిలీప్‌కుమార్‌ను ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య, తన్నమాల కోటారెడ్డి, నాగూర్ యాదవ్‌లు ఘనంగా సన్మానించారు.

## సూళ్లూరుపేటలో చైత్రపౌర్ణమి వేడుకలు



సూళ్లూరుపేట, మే 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో చైత్రపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అభయశంకర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు చేయడంతో పాటు రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షులు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే పట్టణంలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కొండలరావు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేట్రాక్‌కు ఆవలి వైపున శ్మశానానికి దారి చూపించండి



తడ, మే 12 ప్రభాతవార్త : మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడు గ్రామానికి రైల్వే గేటు అవతల శ్మశానం ఉందని, ఇటీవల రైల్వే వారు ఆ గేటును మూసివేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో తహశీల్దార్ శరత్‌బాబుకు ఈ సమస్యను పరిష్కరిం చాలని వినతిపత్రం అందజేశారు. గేటు మూసివేయడం కాకుండా అవతలి వైపు వెళ్లేందుకు వీలులేకుండా ఇరువైపులా ప్రహరీగోడ కట్టారని వారు పేర్కొన్నారు. ఈ గ్రామంలో ఎక్కువగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉన్నారని, ఎవరైనా మృతిచెందితే శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఛైర్మన్ భాస్కర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్‌రెడ్డి గురుమూర్తి, మండల ఓబీసీ ఛైర్మన్ నిత్యానందం, మాజీ ఎంపిటిసి ఎ.చెల్లయ్య తదితరులు ఉన్నారు.

## వాకాటి, రెడ్డివారిలకు పలువురి పరామర్శ



తడ, మే 12 ప్రభాతవార్త : మండలం చేనిగుంటలో సోమవారం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎం ఎల్‌సి వాకాటి నారాయణరెడ్డిని పలువురు నేతలు, అధికారులు రాజకీయాలకు అతీతంగా పరామర్శి ంచారు. ఆయన పినతల్లి చంద్రవదనమ్మ మృతిచెంద డంతో పలువురు చేనిగుంటకు తరలివెళ్లారు. నగరికి చెందిన మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి వియ్యకురాలైన చంద్రవదనమ్మ మృతి పట్ల ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు. రాష్ట్రప్రభుత్వ సలహాదారు జి.సతీష్‌రెడ్డితో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, బిజెపి నాయకులు చెన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, చంద్రప్ప తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

## వేనాడు దీవిలో ఘనంగా రంగపెరుమాళ్‌కు తిరుకల్యాణం



తడ, మే 12 ప్రభాతవార్త : మండలం వేనాడు దీవిలోని శ్రీశృంగేశ్వర శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో సోమవారం చిత్రపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహా తిరుమంజనం, లక్షార్చనతో పాటు సాయంత్రం స్వామివారి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ కార్యక్రమంలో వేనాడు దీవికి చెందిన భక్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. ఒకప్పుడు వేదాంతపురిగా ఉన్న వేనాడు దీవిలోని శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత తిరువరంగ స్వాములవారి పూజలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఈ ఆలయంలో శ్రీరంగపెరుమాళ్ ఆలయంగా గ్రామస్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## ఆర్టీసి బస్టాండు తనిఖీ



నాయుడుపేట, మే 12 ప్రభాతవార్త : ఆర్టీసి బస్టాండును నెల్లూరు ఆర్టీసి రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆర్టీసి బస్టాండులోని పరిసరాలను పరిశీలించారు. వేసవికాలం కావడంతో ప్రయాణికు లకు తాగునీరు అందించాలని సూచించారు. మరుగుదొడ్లు, ఆర్టిసి బస్టాండు ఆవర్ణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. పట్టణం తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నానబాల సుబ్బారావు సురేష్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, తదిరతర నాయకులు, ఆర్టిసి అధికారులు ఉన్నారు.

## కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు చేసుకోవాలి



వెంకటగిరి, మే 12 ప్రభాతవార్త : కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని 14వవార్డు కౌన్సిలర్, వైసిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఆరి శంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల నుంచి లంచం అడిగితే సహించేది లేదు : ఎమ్మెల్యే



గూడూరు, మే 12 ప్రభాతవార్త : ప్రజలకు పనులు చేసేందుకు లంచం అడిగితే సహించేది లేదని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హెచ్చరించారు. సోమవారం గూడూరు పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసిల్దార్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులతో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. ప్రజలకు అందించే పలు సర్టిఫికేట్ల మంజూరులో జాప్యం జరుగుతోందని, కారణాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. సర్టిఫికేట్లు, ఇతర పనులు చేసి పెట్టేందుకు ప్రజల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సమావేశంలో ప్రస్తావించారు. ఇద్దరు వీఆర్వోలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలోనే వారిని ప్రశ్నించారు, ప్రజలకు పనులు చేయలేకపోతే వెళ్ళి పోవచ్చని తెలిపారు. అంతే కానీ వారినుండి నగదు వసూలు చేయడం తగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, రహీమ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు

బాలాయపల్లి, మే 12 ప్రభాతవార్త : లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో రూ.12 లక్షలు ఉపాధి హామీ నిధులతో కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగే స్థలాలను పరిశీలించిన డిప్యూటీ ఎంపిడిఓ మోహన రాజు, ఈఓ.అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ కృష్ణవేణి, అలిమిలి సమీపంలో ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం, సుబ్రమన్యం గ్రామంలో వెలసియున్న శ్రీ షణ్ముఖ సుబ్రమణ్య స్వామి దేవస్థానాలకు ఈ మరుగుదొడ్ల ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఓ మోహన రాజు తెలిపారు. సుబ్రమణ్యం గ్రామంలో స్థల వివాదం ఉంటే పరిశీలించి, పరిష్కరించిన డిప్యూటీ ఎంపిడిఓ మోహన రాజు, ఈఓ.అర్వభూమి శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ కృష్ణవేణిలు, ప్రజలు, భక్తులకు మరుగుదొడ్లు ఉపకరిస్తాయని సర్పంచ్ కృష్ణవేణి తెలిపారు.

## స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే పాశం



చిల్లకూరు, మే 12 ప్రభాతవార్త : మండలం లోని కలవకొండ గ్రామంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు లక్ష్మి నరసింహస్వామి అమ్మవార్లకు ఘనంగా కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా కందల సుధాకర్ నేరిజా వ్యవహరించారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీలు స్వామి అమ్మవారు దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామి అమ్మవార్ల ఆశీస్సులు అక్షింతలు సేకరించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ప్రత్యేక పూలాలంకరణ చేసి గజవాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు.

## పోలీసుల అదుపులో వ్యవసాయ మోటార్ దొంగలు

నాయుడుపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : ఓజిలి మండలంలోని పున్నెపల్లి, నెమలపూడి, తదితర గ్రామాల్లో రైతుల వ్యవసాయ మోటార్‌లను అపహరించు కొని వెళుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విలాసాలకు అలవాటుపడిన కొంతమంది యువకులు కలిసి రాత్రి సమయంలో ఇంటిబయట ఉన్న మోటారుసైకిళ్ళు, వ్యవసాయ మోటార్లు, కాపర్‌వైర్లు చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఆ ముఠాలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు ఓజిలి ఎస్సై స్వప్న తెలియజేశారు.

## విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు : ఎమ్మెల్యే



నాయుడుపేట, మే 12 ప్రభాతవార్త: విద్యార్థులు దేశానికి పట్టుకొమ్మలాంటి వారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట తెదేపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లడుతూ సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పరీక్షఫలితాల్లో అత్యధిక మారు ్కలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. నియోజకవర్గంలోని ఆరుమండలాల్లో 20మంది విద్యార్థులను ఎంపిక చేసి వారిలో ప్రథమ బహుమతి ఆరువేలు, ద్వితీయ బహుమతి ఐదువేలు, తృతీయ బహుమతి నాలుగువేల రూపాయలు ఆమె చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. విద్యార్దులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అవరోదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, తెదేపా మండల పార్టీఅ ధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, మాజీ ఏఎంసి చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, విధ్యాశాఖ అధికారులు, విద్యార్దులు, తెదేపా నాయకులు తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులపై విచక్షణ రహితంగా భౌతికదాడి

-రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

-పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పారిశుధ్య కార్మికులు



తిరుపతిరూరల్, మే12 ప్రభాత వార్త: తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలో కొంతమంది ఆకతాయి వ్యక్తులు మత్తుపదార్థలు సేవించి, పంచాయతీ పారిశుధ్య సిబ్బందిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారని పారిశుధ్య సిబ్బంది కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు వివరించారు. ఈనెల 7న తిరుపతిరూరల్లో గంగజాతర్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులపై 20మంది వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని తెలిపారు. తమకు ప్రాణహాని ఉందని తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు. ఈనెల 9న పెద్దల సమక్షంలో జరిగిని సయోధ్యలో కూడా పెద్దలు మాట వినకుండా గంజాయి బ్యాచ్ పారిశుధ్య సిబ్బందితో పాటు సర్పంచ్‌పై కూడా దాడికి దిగినట్లు సమాచారం. విచక్షణారహితంగా దాడి చేసిన అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని సదరు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదును స్వీకరించి, ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సదరు ఆకతాయ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకోకపోతే విధులుకు హాజరు అయ్యే ప్రసక్తే లేదని పారిశుధ్య సిబ్బంది స్పష్టం చేసారు.

## చెవిరెడ్డి ఓర్వలేక పోతున్నారూ!

తిరుపతి హెల్త్, మే 12 ప్రభాతవార్త : చంద్రగిరి నియోజక వర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని చేస్తున్న అభివృద్ధిని చూసి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఓర్వలేక పోతున్నారని టీడీపీ సీనియర్ నేత ఈశ్వర్‌రెడ్డి విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడా నిధులు ప్రభుత్వ డబ్బులు కాదా అన్నారు. కేవీఎస్ పార్కును తుడా ఆధీనంలోకి తీసుకుంటానని చెబితే చెవిరెడ్డి ఎందుకు భయపడు తున్నారన్నారు. ప్రజా ధనాన్ని దోచుకునే వ్యక్తి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని తెలిపారు. తుడా ఎందుకు పనికిరాదన్న వ్యక్తి రెండు



పర్యాయాలు ఎందుకు ఆపదవిని అలకరించాడని ఆరోపించారు. చెవిరెడ్డి తుమ్మల గుంట ప్రజలను కావాలనే రెచ్చగొడుతు న్నాడని విమర్శించారు. కేవీఎస్ పార్కు చెవిరెడ్డి తాత సొత్తు కాదని, ఆ పార్కు విచారణకు చెవిరెడ్డి సహకరించాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల ఆలనా... పాలనా చూసుకునేందుకు ముందుకు రండి



తిరుపతి కలెక్టరేట్, మే 12 ప్రభాతవార్త ః తిరుపతి జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లల ఆలనా..పాలనా చూసుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని తిరుపతి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణ ఎస్. వసంతాబాయి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లా నందు ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థలకు (ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నడపబడుచున్న నిర్వాహకులకు) మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నటువంటి బాల సదనం, సూళ్ళూరు పేట, తిరుపతి జిల్లా ప్రత్యేక అవసరాలు గల బాలికల కోసం మంజూరు చేయడం జరిగిందన్నారు. కావున ప్రత్యేక అవసరాల గల పిల్లల ఆలనా పాలనా చూసుకొనుటకు, హోమ్‌ను నిర్వహించడానికి అనుభవం, ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు జిల్లా యందలి ప్రత్యేక అవసరాలు గల బాలల సంరక్షణలో అనుభవం ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థలు తమ స్వచ్ఛంద సంస్థ యొక్క రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, సంస్థ యొక్క వివిధ ప్రతులతో ప్రతిపాదనలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వారి కార్యాలయం, బి-బ్లాక్ రూమ్ నెం.505,506, పద్మావతి నిలయం, తిరుపతి జిల్లా కలెక్టరేట్, తిరుపతి జిల్లా మే 24, 2025 తేది సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని తిరుపతి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి, తిరుపతి జిల్లా వారు తెలియజేశారు. ఈ విషయాన్ని తిరుపతి జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థల ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నడపబడుచున్న నిర్వాహకులు తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి ఎస్.వసంతాబాయి కోరారు.

## ఘనంగా పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం



తొట్టంబేడు, మే 12 ప్రభాతవార్త : మండలంలోని చియ్యవరం గ్రామంలో వెలసిన పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒక్క చియ్యవరం గ్రామంలోనే కాకుండా పలు ప్రాంతాల్లో అగ్నిగుండ మహోత్సవం కార్యక్రమూలు జరిగాయి. చియ్యవరంలో గ్రామంలో వెలసిన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అగ్నిగుండ మహోత్సవాన్ని సన్నాహాలు చేశారు. రాత్రి 9గంటలపైన అగ్నిగుండ మహోత్సవం సాగింది సుమారు 200మంది భక్తులు పైగా అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం



సదుం, మే 12 ప్రభాతవార్త : మండల పరిధిలోని బూరగమంద పంచాయతీలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వెంకటేశ్వర స్వామి వారికి కల్యాణోత్సవం కన్నుల పండువగ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవ విగ్రహాలకు స్వామివారి కల్యాణ మండపంలో కళ్యాణోత్సవం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని గరుడ వాహనంలో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉభయ దారులుగా శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు, సెక్యూరిటీ సిబ్బంది పూజారులు పాల్గొన్నారు.

## బోయకొండపై అలరించిన చండీహోమం



బోయకొండ(చౌడేపల్లి), మే 12 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండపై సోమవారం నిర్వహించిన చండీహోమం భక్తులను అలరించింది. ప్రతినెలా పౌర్ణమిన కొండపై దంపతులు, భక్తులు సమక్షంలో చండీహోమాన్ని నిర్వహిస్తున్నారు. దీనివల్ల లోకం శుభిక్షంగా ఉంటుందని భక్తులు నమ్ముతారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు గోవర్ధనశర్మ, అర్చకులు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో హోమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది, వసతులు సమకూర్చారు.



శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా వివిధ వేషధారణలో భక్తులు మొక్కులు తీసుకుంటున్న దృశ్యం. - ప్రభాతవార్త, తిరుపతి

## చిన్నకొటాయ్ ఉత్సవం ముగింపు : గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, మే 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పదిరోజుల పాటు నిర్వహించిన చిన్న కోటాయ్ ఉత్సవం సోమవారం చిత్రాపౌర్ణమితో ముగిసింది. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. సాయంత్రం నుంచి ఆలయంలో ముగింపుసంబరాలు ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్లకు పది రోజుల పాటు ఆలయ ఆవరణలోకి కోట మండపం సమీపంలోని పొగడమాను కింద వట్టి వేళ్ళతో ఏర్పాటు చేసిన పందిరి కింద ఉత్సవాలు జరిపారు. సోమ వారం ముగింపు సందర్భంగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసారు. ఆలయ ఏఇఓలు సతీష్‌మాలిక్ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనంల పర్యవేక్షణలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసి తేరువీధిలోని రాజగోపురం నుంచి సాగించారు. ఉత్సవంను తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధి, బజారువీధుల గుండా సాగింది. చిత్రాపౌర్ణమి సందర్భంగా ఏర్పాటుచేసిన ఉత్సవాన్ని తిలకించటానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఇంటింటి వద్ద స్వామి అమ్మవార్లకు హారతులిచ్చారు.








